

భవితకు బంగారు బాట
'నవోదయ'లో ఆరోతరగతి ప్రవేశాలకు ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తుల గడువు విధించారు. 8లో▸



స్కీం వర్కర్ల నిరసన
సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా స్కీం వర్కర్లు శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించారు. 9లో▸



గరిష్ఠం/కనిష్ఠం
28.2 /11.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు బూత్‌స్థాయి కార్యకర్తల మహా సమ్మేళనం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్‌తోపాటు కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ బూత్‌స్థాయి కార్యకర్తల మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యకర్తలతో వర్చువల్ సమావేశమవుతారని పేర్కొన్నారు. అన్ని మండలాల నుంచి ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

రేపు బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ అండర్– 19 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు గోలేటి సార్స్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు మైదానానికి చేరుకోవాలని కోరారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 13, 14 తేదీల్లో ఖమ్మం జిల్లా బోనగల్లులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 9866652249 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2022– 23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని ముస్లింలు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, జైనులకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ మహమూద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం దరఖాస్తు గడువును ఈ నెల 9 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. https://tsobmms.cgg.gov.in,https://tsmfc.in వెబ్‌సైట్లలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జెండా పండుగ విజయవంతం చేయాలి



జెండాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): జిల్లాలోని అన్నిగిరిజన గ్రామాల్లో ఈ నెల 8న 21వ భీమదేవర జెండా పండుగ, కొలెవార్ ఆత్మగౌరవ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ కోలెవార్(మన్నెవార్) సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవన ఆవరణలో శుక్రవారం నాయకులతో కలిసి భీమదేవర జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కౌటాలలో ఈనెల 8న ఉదయం 11 గంటలకు జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పోషం, అధికార ప్రతినిధి మెర్పల్లి సదాశివ్, మండల అధ్యక్షుడు ఎడ్ల భీమయ్య, నాయకులు హన్మంతు, సంతోష్, సత్తయ్య, నీలయ్య, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్‌టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం తెలిపారు. మహిళా సాధికారతా విభాగం ఇన్‌చార్జి కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు కృష్ణవేణి, శారద, రజితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.జనార్దన్, ఎం.రాజేశ్వర్ కోటేశ్, ప్రేమ్‌కుమార్, రోజ్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం.. ఓ పరీక్ష!



సిర్పూర్(టి) కళాశాలలో తరగతి గదిలోనే ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్

- ప్రభుత్వ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కరువు
- తరగతి గదుల్లోనే ప్రయోగశాలలు
- అరకొర వసతుల మధ్యే విద్యార్థులకు ప్రాక్టికల్స్
- పట్టించుకోని అధికారులు

సిర్పూర్(టి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు కరువయ్యాయి. పలుచోట్ల తరగతి గదుల్లో తాత్కాలికంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయోగాల నిర్వహణ కష్టంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్మీడియెట్ సెకండియర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. వార్షిక పరీక్షలకు ముందే అధ్యాపకులు విద్యార్థులతో ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రయోగాలు కలగానే మిగులుతున్నాయి. అరకొర వసతుల మధ్య తరగతి గదుల్లోనే నామమాత్రంగా ప్రయోగశాలలు కొనసాగిస్తుండటంతో ప్రయోగాలు చేయకుండానే చదువు ముగుస్తోంది.

11 జూనియర్ కళాశాలలు..

జిల్లాలో సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, రెబ్బెన, కాగజ్‌నగర్, తిర్యాణి, ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్, దహెగాం, కెరమెరి మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 2400పైగా విద్యార్థులు ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అందులో ఎంపీసీ బైపీసీ కోర్సుల్లో 1,064 మంది ఉన్నారు. వీరికి తప్పనిసరిగా ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. అధ్యాపకులు అరకొర వసతులు, సామగ్రి, కెమికల్స్ కొరతతో ప్రయోగాలు నిర్వహించే పరిస్థితులు లేవు. ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్మీడియెట్ ప్రభుత్వం ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. ప్రాక్టికల్స్ నిర్వహణకు మూడేళ్లుగా నిధులు కేటాయించడంలేదు. కరోనా సమయంలో మూతపడిన కళాశాలల్లో మిగిలిన రసాయనాలతోనే అధ్యాపకులు ప్రాక్టికల్స్ చేస్తున్నారు. ప్రత్యేక నిధుల కోసం, అవసరమైన సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదించామని, ఎలాంటి నిధులు మంజూరు కాలేదని అధికారులు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని వారు పేర్కొంటున్నారు.



బీరువాలో ప్రాక్టికల్స్ సామగ్రి

గదుల కొరత..

జిల్లాలోని ఒక్క ప్రభుత్వ కళాశాలలో కూడా ప్రత్యేక ల్యాబ్ సౌకర్యం లేదు. ప్రభుత్వం పంపిణీ చేసిన సామగ్రి, రసాయనాలు ఇతర వస్తువులను తరగతి గదుల్లో భద్రపరుస్తున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణ సమయంలో బీరువాల నుంచి సామగ్రి బయటికి తీసి విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యేక ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రత్యేక ల్యాబ్ లేదు



సిర్పూర్(టి)లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక ల్యాబ్ సౌకర్యం లేదు. తరగతి గదిలోనే నామమాత్రంగా ప్రయోగాలు చేస్తున్నాం. అవసరమైన సామగ్రి, కెమికల్స్ పూర్తిస్థాయిలో లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ల్యాబ్ నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించి వసతులు కల్పించాలి.

– డి.ప్రతాప్, ద్వితీయ సంవత్సరం, సిర్పూర్(టి)

మూడేళ్లుగా నిధులు లేవు



జిల్లాలోని 11 జూనియర్ కళాశాలల్లో ల్యాబ్, ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన మెటీరియల్స్‌తోపాటు ప్రత్యేక నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మూడు సంవత్సరాలుగా ప్రాక్టికల్స్ నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరు కాలేదు. ఉన్న దాంట్లోనే ప్రాక్టికల్స్ నెట్టుకొస్తున్నాం. నిధులు రాగానే సామగ్రి, కెమికల్స్ కొనుగోలు చేస్తాం.

– శ్రీధర్‌సుమన్, డీఐఈవో

తప్పని నిరీక్షణ!

- రేషన్ కార్డుల్లో కొత్త పేర్ల నమోదులో తీవ్ర జాప్యం
- వివిధ స్థాయిల్లో పెండింగ్‌లోనే 14,145 దరఖాస్తులు



ఆసిఫాబాద్‌అర్బన్: రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్ల నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొత్త లబ్ధిదారుల వివరాల నమోదుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వం కొత్త లబ్ధిదారులకు కార్డులు మంజూరు చేసింది. కార్డుల జారీ సమయంలో టెక్నికల్ సమస్యలతో చాలా మంది పేర్లు అప్పట్లోనే రికార్డుల్లో నమోదు కాలేదు. అలాగే కొంత మంది పెళ్లిళ్లు అయిన వారి పేర్లు తొలగించి కొత్త కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా, మరి కొంత మంది పేర్లు పాత కార్డుల్లోనే చేర్చాల్సి ఉంది. ఇటీవల కొత్త కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం పాతకార్డుల్లో మార్పులకు మాత్రం అవకాశం ఇవ్వలేదు. మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్న అధికారులు కొత్త పేర్ల నమోదుపై దృష్టి పెట్టకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లోనే దరఖాస్తులు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 299 రేషన్ షాపులు ఉన్నాయి. 1,26,253 ఎఫ్ఎస్‌సీ కార్డులు, 12,988 అంత్యోదయ, 20 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం మరో 5,420 నూతన రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఏడేళ్ల క్రితం రేషన్ లబ్ధిదారులను ఎంపిక చేసిన ప్రభుత్వం ఆ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ అమలవుతోంది. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు సైతం మంజూరు చేసింది. కానీ కొత్త సభ్యులను మాత్రం కార్డుల్లో చేర్చేందుకు అవకాశం ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 20,456 మంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు చేసుకోని వారు వేలల్లో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త సభ్యుల పేర్లను సైతం జాబితాలో చేరిస్తే జిల్లాకు బియ్యం కోటా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పేర్ల నమోదుకు అవకాశం కల్పించకపోవడంతో చాలా మంది పేదలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు

దరఖాస్తులు	14,145
సభ్యులు	20,456
ఇన్‌స్పెక్టర్ వద్ద పెండింగ్	7,209
ఏఎస్‌వో, తహసీల్దార్ వద్ద పెండింగ్	266
డీఎస్‌వో వద్ద పెండింగ్	3,954
అప్రూవల్ అయినవి	2,506
రిజెక్ట్ అయినవి	210

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డుల్లో కొత్త వారి పేర్లు నమోదు చేసేందుకు అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హుల వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నాధికారులకు నివేదిస్తున్నాం. కొత్త సభ్యుల పేర్ల నమోదుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– తారామణి, డీఎస్‌వో

ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట దీక్షల్లో కూర్చున్న కార్మికులు

ఆసిఫాబాద్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రెండో రోజు రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అధికారుల వేధింపులు, తొలగింపులు అరికట్టాలని, ట్రావెలింగ్ అలవెన్స్, ఫోన్ బిల్లులు నెలకు రూ.5 వేలు అదనంగా చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫాం, టార్చ్‌లైట్స్, పంప్ హౌజ్‌ల దగ్గర రెస్ట్ రూములను ఏర్పాటు చేయాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు జీవో 60 లేదా 11ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బాలేశ్, లింగయ్య, గౌతం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం(సిర్పూర్): నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోనేరు ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏడేళ్లుగా కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల్లో వేగం పెంచి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కళాశాలకు సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందవెల్లి పెద్దవాగుపై కూలిన వంతెన వద్ద నాలుగు రోజుల్లో పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా చిన్న ఐనం సమీపంలోని మార్కెట్ గోదాం వద్ద మార్కెట్ కమిటీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, వెల్మ్మలే జయేందర్, ప్రిన్సిపాల్ అమరేందర్, మార్కెట్ కమిటీ డీఈ శ్యామ్యూల్, ఏఈ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు చైతన్యవంతులు కావాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కొనసాగుతున్న బహుజన రాజ్యాధికార యాత్ర



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెంచికల్‌పేట్(సిర్పూర్): బహుజనులు చైతన్యవంతులై రాజ్యాధికారం దక్కించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ, ఎల్కపల్లి, ఎల్లూర్, అగర్‌గూడ గ్రామాల్లో శుక్రవారం బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు అందించలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారినా పట్టించుకోవడంలేదని, మాస్టర్ ప్లాన్‌ల పేరిట పేదల భూములను లాక్కుంటుందని ఆరోపించారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులకు పోడు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పెంచికల్‌పేట్ వద్ద పెద్దవాగు అప్రోచ్ పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బహుజనుల సమస్యల పరిష్కారానికి ప్రజలందరూ బీఎస్పీని ఆశీర్వదించాలని కోరారు. చట్టసభల్లో జనాభాకు అనుకూలంగా బీసీల రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు చేడ్వాయి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జ్యోతి, దుర్గం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఐటీడీఏ సహకారంతో జంగుబాయి ఆలయ అభివృద్ధి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఆలయ ఆవరణలో దర్బార్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కటోడాలకు నమస్కరిస్తున్న అదనపు కలెక్టర్

కెరమెరి(ఆసిఫాబాద్): జంగుబాయి ఆలయం పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఐటీడీఏ సహకారంతో దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. కెరమెరి మండలం జంగుబాయి ఆలయంలో శుక్రవారం మహాపూజ అనంతరం ఏర్పాటు చేసిన దర్బార్‌లో వారు మాట్లాడారు. గతంలో కన్నా ఈ ఏడాది ఉత్సవాలకు సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. తాత్కాలికంగా అర కిలోమీటర్ రోడ్డు ఏర్పాటు చేశామని, ముకదంగూడలో బోరు వేసి అక్కడి నుంచి పైపుల ద్వారా నీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర అనే తారతమ్యం లేకుండా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. మురుగుదొడ్లు, షెడ్లు, సత్రాలు, కటోడాలు ఉండేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేశామని చెప్పారు. సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయంలో సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దీంతోపాటు 470 ఎకరాలకు సంబంధించి పట్టాల విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చారు.

ఆలయ స్థలాలు కాపాడాలి

ఆదివాసీ దేవతల ఆలయ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. యువత పాశ్చత్య పోకడలకు పోకుండా మన సంస్కృతి, ఆచార వ్యవహారాలు రక్షించాలన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని నిర్వహించిన గోండి ధర్మ సమ్మేళనం లాంటి కార్యక్రమాలు ఇక్కడా నిర్వహించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో జాతరల నిర్వహణకు అధికారులు సహకరిస్తున్నారని, అలాగే జంగుబాయి ఆలయంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ గోడాం నగేశ్ మాట్లాడుతూ 2017లోనే ఏడు సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు గుట్టపై సీసీ రోడ్డు వేయించాన్నారు. ఆలయంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసీలను ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అంతకు ముందు డోలు సన్నాయిలతో అధికారులు, ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. తలపాగాలు చుట్టి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఐటీడీఏ చైర్మన్ కనక లక్కెరావ్, డీడీ మణెమ్మ, ఏపీవో భాస్కర్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు కొడప జాకు, మరప బాజీరావ్, కోశేరావ్, బాపురావ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిల్యాండ్, సింగాపూర్‌లో చదువుకునేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ మహమూద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2022 నుంచి డిసెంబర్ 2022 మధ్య అడ్మిషన్లు తీసుకున్న వారు https:// telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖా స్తు, ధ్రువీకరణ పత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించా లన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు విడతల్లో రూ.20లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు.

ఎంసెట్ శిక్షణపై పట్టు సాధించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఎంసెట్‌పై అధ్యాపకులకు శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న సైన్స్ అధ్యాపకులు ఎంసెట్ శిక్షణపై పట్టు సాధించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళమైన విధానాలతో బోధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం సైన్స్ అధ్యాపకులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎంసెట్ పరీక్షపై ఆసక్తిని కనబర్చడం లేదని, వారిని ఆకట్టుకునేలా ప్రత్యక్షంగా నేర్చుకునేలా 'జాయ్‌ఫుల్ లర్నింగ్' రీతిలో బోధించడంలో అధ్యాపకులు ముందుండాలన్నారు. గణితం, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల అధ్యాపకులకు రెండుపూటలా బోధనా రీతులపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. డీఐఈవో శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా ప్రిన్సిపాళ్లు నైతం శంకర్, రాందాస్, కల్యాణి, లక్ష్మణ్‌రావు, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేహదారుఢ్య పరీక్షల్లో 4,780 మందికి అర్హత

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 4,780 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన వారు 2,305, ఓసీ వర్గానికి చెందిన వారు 63 మంది, ఎస్సీలు 988 మంది, ఎస్టీలు 1,424 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 3,740 మంది, మహిళా అభ్యర్థులు 1040 మంది, ఎక్స్ సర్వీస్‌మెన్ కుటుంబాలకు చెందిన వారు 16 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇరాక్‌లో జన్నారం వాసి మృతి


సాయిలు(ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఉపాధి వేటలో ఒకరి ఊపిరి ఆగింది. జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎలుక సాయిలు (45) కొన్నేళ్లుగా ఇరాక్‌లోని ఓ కంపెనీలో కూలి పని చేస్తున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చిన సాయిలు మళ్లీ తిరిగివెళ్లాడు. గురువారం అతనికి చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో అతనితో కలిసి పనిచేసేవారు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కోరుతున్నారు.

పాము కాటుతో రెండేళ్ల చిన్నారి మృతి

చెన్నూర్‌రూరల్:రెండేళ్లకే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. మృత్యువు పాము రూపంలో చిన్నారిని కబళించింది. చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన చిగిరి సంధ్య, మధుకర్ దంపతుల కూతురు మనశ్రీ(2) శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందింది. మనశ్రీ ఇంటి ముందు ఉన్న రోడ్డుపై ఆడుకుంటున్న సమయంలో పాటు కాటేసింది. అక్కడే ఉన్న మరోబాబు చూసి మనశ్రీ తండ్రి మధుకర్‌కు విషయం చెప్పాడు. వెంటనే అతను ద్విచక్ర వాహనంపై చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

ఆప్షన్లు నమోదు చేసుకోవాలి

ఉట్నూర్: కాళోజీ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ కన్వీనర్ కోటాలో సీటు పొందాలనుకునే గిరిజన విద్యార్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు టీఎస్‌పీఏఆర్‌ఏ ఎంఈడీ.టీఎస్‌సీహెచ్‌ఈ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు నాలుగేళ్లు, బీపీటీ రెండేళ్ల కోర్సులో చేరాలనుకునే గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆస్పత్రిలో గర్భిణి మృతి

దహెగాం(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం పోతెపెలికి చెందిన గర్భిని డోకె స్వరూప (22) కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం రాళ్లగూడ గ్రామానికి చెందిన భుజంగరావు కుమార్తె మొదటి కాన్పుకు తల్లిగారింటికి సోమవారం వచ్చింది. దీంతో బుధవారం మంచిర్యాల ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుని రాళ్లగూడకు వెళ్లింది. గురువారం సాయంత్రం పురిటినొప్పులు రావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది.

'అమ్మ'కు నీరాజనం


రావుడ్ దేవతకు మొక్కుతున్న అధికారులు


మైసమ్మకు మొక్కుతున్న జిల్లా అధికారులు

కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయంలో శుక్రవారం మహాపూజ నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గోడం నగేశ్, ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జంగుబాయి గుహను సందర్శించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏపీవో భాస్కర్, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఎస్సై వెంకటేశ్, ఎంపీపీ పెందోర్ మోతిరాం, తదితరులు పాల్గొన్నారు. - కెరమెరి



'పోతురాజ్'కు పోటెత్తిన భక్తజనం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా, ఇందాపూర్ సమీపంలో ఉన్న పోతురాజ్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. భీమదేవరా, తదితర ప్రతిమలకు, నాలుగు గోత్రాలకు చెందిన నాలుగు జెండాలకు పూజలు చేశారు. మైసమ్మకు నూనెతో అభిషేకం చేశారు. ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆదివాసీ మహిళలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. - కెరమెరి


మైసమ్మకు మొక్కుతున్న భక్తులు

ఈ-పంచాయతీ ఇక అంతేనా.?

- జిల్లాలోని 110 క్లస్టర్లకు కంప్యూటర్లు
- పల్లెల్లో అందని ఆన్‌లైన్ సేవలు
- నెట్ ఉన్నా ముందుకు సాగని పనులు
- ప్రతి పనికీ మండల కేంద్రానికి వెళ్తున్న ప్రజలు
- అధికారుల నిర్లక్ష్యంతో తప్పని ఇబ్బందులు


హాజీపూర్ పంచాయతీ కార్యాలయంపై ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ పాయింట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఈ-పంచాయతీ పాలన ఏ మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. గ్రామ పంచాయతీల ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రతీ పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. కుల, నివాసం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇంటి, నీటి పన్నుల వసూళ్లు కూడా అంతా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకూ ఈ సేవలు ప్రజలకు చేరువ కాలేదు.

2018లో ఈ-పంచాయతీకి అంకురార్పణ

మంచిర్యాల జిల్లాలోని 16 మండలాల్లో 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018లోనే ప్రభుత్వం ఈ-పంచాయతీ పాలనకు అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు జనన, మరణ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఇంటి, నీటి పన్నుల వసూళ్లు, ఇంటి నిర్మాణ అనుమతులు ఇలా అన్ని పనులు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించింది. 310 గ్రామ పంచాయతీలను 110 క్లస్టర్లుగా విభజించి క్లస్టర్‌కు ఒకటి చొప్పున కంప్యూటర్ అందించి తెలంగాణ-టీఫైబర్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది. పంచాయతీ భవనాల్లో సర్వర్ ప్యానల్ బాక్సులు, భవనాలపై సోలార్ ఎనర్జీ పాయింట్లను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు అధికారికంగా 300 పంచాయతీల్లో నెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయినా ఏ ఒక్క పంచాయతీలో కూడా ఈ-పంచాయతీ అందుబాటులోకి రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతీపనికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

వివిధ రకాల సేవలు ఇవే..

- జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీతో పాటు ఇంటిపన్నుల వసూళ్లు, నీటిపన్నుల వసూళ్లు, గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధుల విషయంలో పారదర్శకంగా ఉండబోనుంది.
- పంచాయతీలకు వచ్చిన నిధులు ఎన్ని, ఖర్చు చేసిన వివరాలు, అభివృద్ధి పనుల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉండాలంటే ఆన్‌లైన్ ద్వారానే సేవలు అమలులో ఉంటేనే సాధ్యమవుతుంది.
- మాన్యువల్‌గా అయితే రికార్డుల్లో పొందుపర్చిన వివరాలు మళ్లీ రాసే అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లో వివరాలు ఒక్కసారి నమోదు చేస్తే తిరిగి ఆ వివరాలను మార్చడం వీలుకాదు.

చర్యలు చేపడతాం



ఈ-పంచాయతీ విధానాన్ని అమలులోకి తీసుకువస్తూ ఆన్‌లైన్‌లో గ్రామ ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 110 క్లస్టర్లకు కంప్యూటర్లు అందించింది. చాలా గ్రామాల్లో నెట్ సౌకర్యం లేక ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం అన్ని జీపీలకు టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించింది. గతంలో పంపిణీ చేసిన వాటిలో ఉన్న వాటితో పాటు అవసరమైతే మరిన్ని కంప్యూటర్లను సమకూర్చుకునేలా చూస్తాం. ఈ-పంచాయతీ సేవలు అందుబాటులో తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం.
- ఫణీందర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

50 ఉన్నా మరో 60 ఊసే లేదు..

110 కంప్యూటర్లలో 50 కొంతలో కొంత పని చేస్తున్నప్పటికీ మిగిలిన 60 కంప్యూటర్ల లెక్క కనిపించడం లేదు. అయితే మాకు ఎలాంటి కంప్యూటర్లు అప్పగించలేదని గత సర్పంచ్‌లు చెప్తున్నారు. మరికొన్ని పంచాయతీల్లో కంప్యూటర్లు దుమ్ము పట్టి పనికి రాకుండా పోయాయి. నెట్ ఉన్న పంచాయతీలు కంప్యూటర్లకు మరమ్మతు చేయించి ఈ-పాలన అమలుకు కార్యదర్శులు కృషిచేసే అవకాశం ఉన్నా ఆదిశగా పనిచేయడం లేదు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

జన్నారం(ఖానాపూర్): మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన నగేశ్ ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లాడు. కంపెనీ వీసాకోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఓ కంపెనీ వద్ద గ్యాస్ లీకేజీ అయి గాయాల పాలయ్యాడు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. విషయాన్ని తెలంగాణ గల్ఫ్ సంక్షేమ సమితి రోటిగూడ కమిటీకి సమాచారం అందివ్వడంతో స్పందించిన కమిటీ సభ్యులు విరాళాలు సేకరించగా వచ్చిన రూ.51 వేలను శుక్రవారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సేపూరి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, మల్లారెడ్డి, రాజరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, గంగన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ సీజ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ సాయికుంట చెరువు సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సాయికుంట చెరువును సుందరీకరణ ముసుగులో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లు అధికారులు ఫిర్యాదులు అందాయి.

భవితకు బంగారు బాట



కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

- జవహర్ నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశప్రక్రియ షురూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 వరకు గడువు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యావి భాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. విద్యాలయంలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తుకు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2023, ఏప్రిల్ 29న(శనివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభించారు.

అర్హతలు ఇవే..

- 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థులు 2011, మే1 నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించిన వారై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టపడి చదవాలి. మరిన్ని వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలి.
- బి.చక్రపాణి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం

- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో నింపబడతాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైన విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుంది.
- బాలికలకు కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

- జిల్లా విద్యాలయంలో సహవిద్యా, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్
- ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌ఎస్‌ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి, ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ వంటి ఉన్నత పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ
- 'పది' ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన.

క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటాలి


మాట్లాడుతున్న శశాంక్ యాదగిరి

బెల్లంపల్లి: క్రికెట్ పోటీల్లో రైల్వే క్రీడాకారులు ప్రతిభ చాటాలని దక్షిణ మధ్యరైల్వే బెల్లంపల్లి డివిజన్ ఇంజినీర్ శశాంక్ యాదగిరి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పోటీలు ప్రారంభించి మాట్లాడారు. కొన్నాళ్ల విరామం తర్వాత రైల్వే క్రీడాకారులకు క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ రమేశ్, జాయింట్ సెక్రెటరీ సాల్మన్ మాట్లాడుతూ పోటీలు ఈ నెల 17 వరకు జరుగుతాయన్నారు. మహారాష్ట్రలోని మాణిక్ ఘడ్ నుంచి రామగుండం వరకు రైల్వే క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని, మొత్తం 15 టీమ్‌లు వచ్చాయని వివరించారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, రైల్వే కార్మిక సంఘాల నాయకులు నాగరాజు, సాంబశివుడు, అధికారులు బుచ్చిబాబు, హరిబాబు, అనిల్, రమేశ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

'స్కీంవర్కర్లను కార్మికులుగా గుర్తించాలి'



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాతమంచిర్యాల: స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్, ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా కోటి మంది రాష్ట్రంలో 3.50 లక్షలమంది స్కీంవర్కర్లు ఏళ్ల తరబడిగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, ఐకేపీ వీవోఏల జిల్లా అధ్యక్షుడు దూర్కె మోహన్, కార్యదర్శి కుమార్, కోశాధికారి దుర్గం లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు లచ్చన్న, దాసు, లింగన్న, తుకారాం, తిరుపతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా


బోల్తా పడిన వడ్ల లారీ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని బొప్పారం నర్సరీ వద్ద గురువారం రాత్రి అదుపుతప్పి లారీ బోల్తా పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. లక్సెట్టిపేట నుంచి నందులపల్లి రైస్‌మిల్లుకు వడ్ల బస్తాలతో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న మరో వాహనానికి సైడ్ ఇచ్చేక్రమంలో రోడ్డుదిగిన లారీ పైకి ఎక్కేక్రమంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. అటవీ శాఖ అధికారుల అనుమతి లభించకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డును తక్కువ వెడల్పుగా వేయడం, ఇరువైపులా మొరం పోయించక పోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటి వరకు 30 నుంచి 40 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా మొరం పోయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాసర ఆలయంలో పౌర్ణమి పూజలు


ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బాసర(ముథోల్): పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించి శతఃఅర్చన పూజలు జరిపించారు. ఆలయ అధికారులు, వైదిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): గనుల్లో ఎలక్ట్రికల్ ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీఎంఎస్) ఆనంద్‌వేల్ అన్నారు. శుక్రవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఎలక్ట్రికల్‌కు సంబంధించిన అంశాలపై జీఎం బీ.సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌వేల్ మాట్లాడుతూ సింగరేణిలో కొన్ని సంవత్సరాలుగా ప్రమాదాలు చాలా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంఎస్ గౌరవ్‌లడ్డా, ఇందారం ఓసీపీ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రమేశ్ బాబు, ఏరియా రక్షణాధికారి గోషిక మల్లేశ్, మేనేజర్ రవికుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేశ్, గని రక్షణాధికారి ఏఆర్ సహాని పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు అందజేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని అడిషనల్ డీఆర్‌డీవో చరణ్‌దాస్, ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం) వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని లంబాడితండా, మాలగురిజాల, రంగపేట, బుధాకుర్దు గ్రామాల్లో లబ్ధి దారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సక్రమంగా వినియోగించి అభివృద్ధి చెందేలా చూసుకోవాలన్నారు. దుర్వినియోగం చేసుకుని ఇబ్బందులకు గురికావద్దన్నారు. సంఘాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యామల, సీసీ ప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతులు

జన్నారం: కొన్నేళ్లుగా నిలిచిపోయిన డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతు పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 2018లో కడెం ప్రధాన కాలువలోని 13వ డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న అప్పటి కాంట్రాక్టర్ పనులు చేయకుండానే వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆ పనిని రెండు భాగాలు విభజించారు. రూ.4 కోట్లతో దేవునిగూడ నుంచి రేండ్లగూడ వరకు, రేండ్లగూడ నుంచి బాదంపల్లి వరకు పనులు చేయాల్సి ఉంది. ఇందులో మొదటి భాగం పనులు ప్రారంభించారు.

కాసిపేట-2 గనిలో ప్రమాదం

- ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌కు గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ ప్రేమ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సదరు కార్మికుడు గనిలోని ఫోర్త్‌లెవల్ నార్త్ జోన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగి కార్మికుడిని తాకడంతో చేతిభాగం కాలిపోయింది. గమనించిన తోటి కార్మికులు ప్రేమ్‌కుమార్‌ను రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మూడు రోజుల క్రితం గనిలో రోఫ్ తగిలి కార్మికుడి కాలు విరిగింది. వరుస ఘటనలతో కార్మికులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం సంఘటన స్థలాన్ని ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ లడ్డా సందర్శించి వివరాలు సేకరించారు.